

భీమవరంలో నేలకొరిగిన సార్వా చేలు

వర్షాలతో.. అంతా వెనక్కి!

- లక్షా 20వేల ఎకరాల్లో సార్వా పంట మాసూళ్లు ఆలస్యం
- వచ్చే దాళ్వా నారుమడులపై ప్రభావం
- సాగు.. మాసూళ్లలో రైతుల అంచనాలు తారుమారు

భీమవరం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో సార్వా పంట మాసూళ్ల ప్రభావం రాబోయే దాళ్వా పంట నారుమడులపై పడుతున్నది. నాలుగు రోజులుగా సాగు పనులు నిలిచిపోవడం వర్షాలతో మరో నాలుగు రోజులు పనులు జరిగేలా కనిపించడం లేదు. దీంతో వచ్చే దాళ్వా సాగు జాప్యానికి దారి తీస్తున్నది. సార్వా పంటలో ఇంకా లక్ష 20 వేల ఎకరాలలో మాసూళ్ళు కావల్సి ఉంది. అది పూర్తి అవ్వాలంటే మరో 10 రోజుల నుంచి 15 రోజులు పడుతుంది. ఆ లెక్కన దాళ్వా నారుమడులు వేయడానికి 15 రోజులు పడుతుంది. దీంతో దాళ్వా సాగు ఆలస్యంగా సాగుతుంది. వచ్చే దాళ్వా పంట జిల్లాలో 2లక్షల 25వేల ఎకరాలలో సాగనుంది. దానికి సంబంధించి 10వేల ఎకరాలలో నారుమడులు వేయాలి. ఇప్పటి వరకు మెట్టకు సంబంధించి 10వేల ఎకరాలలో సాగుకు 500 ఎకరాలు నారుమడులు మాత్రమే పడ్డాయి. ఇంకా 9500 ఎకరాలలో నారుమడులు వేయాలి. వర్షాలు లేకపోతే 30శాతం నారుమడులు పడతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఏవిధంగా చూసినా వాయుగుండం వర్షాలు దాళ్వా సాగు గాడి తప్పేలా చేశాయి. సార్వా పంట మాసూళ్లలో రైతులు అవస్థలకు గురయ్యేలా చేస్తున్నాయి.



బీచ్‌లో అలల ఉధృతి

ఎగసిపడ్డ అలలు

పర్యాటకులు లేక బోసి పోయిన తీర ప్రాంతం

మొగల్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలు పడుతుండడంతో పాటు సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా నిషేధం విధించారు. ప్రతి ఏటా కార్తీక మాసం ఆఖరి ఆదివారం పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తారు. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో కార్తీక మాసం ఆఖరి ఆదివారం పర్యాటకులకు రాకను అధికారులు నిషేధించారు. దీంతో సందర్శకులు లేకపోవడంతో బీచ్ బోసి పొయింది. కెపి పాలెం, పేరుపాలెం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా పోలీసులు ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేయడంతో పాటు తీర ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు. సీఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ జి.వాసు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించా రు. రెవెన్యూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహించారు.

జిల్లా అంతటా వర్షాలు

భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి : తుఫాన్ కారణంగా జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సూర్యుడు కనిపించటంతో తుఫాన్ ప్రభావం ఇకలేదని అనుకున్నారు. అయితే మధ్యాహ్నం నుంచి మళ్లీ వాతావరణం మారి ఆకాశం మేఘావృతంగా మారి పోయింది. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. శనివారం ఉదయం 8-30 నుంచి ఆదివారం ఉదయం 8-30 వరకు జిల్లాలో కురిసిన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరంలో 11.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా కాళ్ళలో 12, మొగల్తూరులో 25.8, నరసాపురంలో 22.4, పాలకొల్లులో 28.6, యలమంచిలిలో 22.4, వీరవాసరంలో 10.8, పోడూరులో 17. ఆచంటలో 26.4, ఇరగవరంలో 17.8, పెనుమంత్రలో 13.4, పాలకోడేరులో 7.4, ఉండిలో 7.6, ఆకివీడులో 8.4, గణప్యావరంలో 8.4, అత్తిలిల్లో 13.2, తణుకులో 10.4, పెంటపాడులో 10.8, తాడ్యేపల్లిగూడెంలో 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



డీఎంహెచ్‌వో మహేశ్వరరావుకు మెమెంటో అందిస్తున్న దృశ్యం


నా ఆరోగ్యం నా హక్కు

ఈ నినాదమే ఎయిడ్స్‌కు పరిష్కారం..
డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

భీమవరం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదమే ఎయిడ్స్‌కు పరిష్కారమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.డి.మహేశ్వరరావు అన్నారు. ఆదివారం భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా.డి.మహేశ్వరరావు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వ్యక్తులను వివక్షతకు గురికాకుండా వారు సమాజంలో ఒక భాగమని గుర్తించి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏపీశాక్స్ ఐఈసీ కరపత్రాలను డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు, జిల్లా అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భాను నాయక్ ఆవిష్కరించారు. ఏఆర్టీ సీనియర్ డాక్టర్ ఎం గోవిందబాబు మాట్లాడుతూ హెచ్ఐవి సోకినవారు పౌష్టికాహారం, వ్యాయామంతో పాటు ఏఆర్టీ మందులు క్రమం తప్పకుండా వాడటం వలన ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చు అన్నారు. జిల్లా వ్యాప్తంగా విశిష్ట వైద్య సేవలు అందించిన వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు 40 మందికి మెమెంటోలు అందజేశారు. హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కళాజాత కార్యక్రమం నిర్వహించారు.

వీడని విభజన కష్టాలు

- పాలనా సమస్యలు
- నిధుల కేటాయింపులోనూ వ్యత్యాసం
- నష్టపోతున్న పశ్చిమ



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లాల పరిధిని విభజించారు. స్థానిక అవసరాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోలేదు. పాలన పరంగా ఇంకా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. పేరుకే విభజన తప్పా కొత్తగా ఒరిం గేదేమీ లేదన్న భావన జనంలో బలంగా నాటుకు పోయింది. విభజనతో పశ్చిమకు అనేక నష్టాలు వాటిల్లాయి. ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కు లేకుండా పోయింది. ప్రధానంగా ఇసుక పెద్ద సమస్యగా మారిపోయింది. జిల్లాలో రీచ్‌లు లేవు. ర్యాంప్‌లు లేవు. గతంలో జిల్లా పరిధిలో నిడదవోలు, కొవ్వూరు ర్యాంప్‌లు ఉండేవి. ఇసుక అందుబాటులో ఉండేది. తాజాగా పర్యావరణ కారణాలతో జిల్లాలో ఇసుక ర్యాంప్‌లకు అనుమతి లేకుండా పోయింది. దాంతో తూర్పు గోదావరి జిల్లాపై ఆధారపడాల్సి వస్తోంది. అక్కడ అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తర్వాతే జిల్లా అవసరాలకు ఇసుక సరఫరా చేసే పరిస్థితి నెలకొంది. అధిక ధరలు, దళారుల ప్రమేయంపైనా జిల్లా అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. చెప్పుకుంటే పోతే ఇటువంటి సమస్యలు అనేకం ఉన్నాయి.

అభివృద్ధి ఏదీ..

జిల్లా విభజన తర్వాత పశ్చిమ పట్టణ కేంద్రీకృతంగా ఏర్పాటైంది. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో మున్సిపాలిటీలు, నగరపంచాయతీలున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే అన్ని రకాల నిధులు విడుదల అవుతున్నాయి. పట్టణాలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. నిధుల విషయంలోనూ పట్టణాలపై భారం పడుతోంది. అమృత్ పథకంలో నిధులు కేటాయిం చినా సరే మునిసిపాలిటీలు తమ వంతు గా పన్నులతో సహా 30శాతం భరించాల్సి వస్తోంది. మరోవైపు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోనే జిల్లా అంతా విలీనం అయి ఉంది. అంటే ప్లాన్‌లు మంజూరు కావాలంటే ఏలూరు డెవలప్ మెంట్ అథారిటీపై ఆధారపడాల్సి వస్తోం ది. విభజన తర్వాత ఉడా అక్కడకే జిల్లా ప్రజలు అనుమతులకు వెళ్లే పరిస్థితి నెలకొంది.

నిధుల విడుదలలోనూ వ్యత్యాసం

నిధుల మంజూరులోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రధానంగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జిల్లా యూనిట్‌గా నిధులు కేటాయిస్తారు. మానవ వనరులతో చేపట్టే పనులను పరిగణలోకి తీసుకుని సిమెంట్, ఇసుక, చిప్స్ యంత్ర పరికరాలను ఉపయోగించి అభివృద్ధి చేసే పనులకు నిధులు కేటాయిస్తారు. మానవ వనరులను అంటే లేబర్‌ను ఉపయోగించి రూ. 100 కోట్లు పనిచేస్తే అందులో 40శాతం నిధులను సీసీ రహదారులు, డ్రెయిన్‌లు ఇతర పనులకు నిధులు కేటాయిస్తారు. పశ్చిమగోదావరి ముఖ్యంగా డెల్టాతో ఏర్పడింది. విభజనలో పూర్తిగా మెట్ట ప్రాంతాన్ని కోల్పోయారు. మెట్టలోనే లేబర్‌ను ఉపయోగించి పనులు నిర్వహిస్తుంటారు. గతంలో జిల్లా యూనిట్‌గా పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాను లెక్కకట్టేవారు. దాని ఆధారంగానే రహదారులు, డ్రెయిన్‌లు, ఇతర అభివృద్ధి పనులకు 40శాతం నిధులు కేటాయించేవారు. ప్రతినియోజకవర్గానికి సమానంగా నిధులు ఇచ్చే పరిస్థితి ఉండేది. తాజాగా విభజన వల్ల జిల్లాలో లేబర్‌ను వినియోగించే పనులు తగ్గిపోయాయి. ఫలితంగా రహదారుల అభివృద్ధికి ఉపాధి నిధులను మంజూరు చేయడంలోనూ వ్యత్యాసం ఏర్పడింది. ఏలూరు జిల్లాలో ప్రతి నియోకజవర్గానికి దాదాపు రూ. 20 కోట్లు వంతున మంజూరయ్యాయి. అదే పశ్చిమగోదావరి జిల్లాలో నియోజకవర్గానికి రూ. 7.00 కోట్లు వంతున కేటాయించారు. ఇదే విషయమై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఘొల్లుమంటున్నారు. కొన్ని రంగాలు ఇప్పటికీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. అందుకే నిధుల విషయంలోనూ ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పరిగణించాలంటూ జిల్లా ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా ఆసుపత్రి ఎక్కడ ?

పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ఉన్నచోట జిల్లా ఆసుపత్రి ఉండకూడదు. దాంతో తణుకులో జిల్లా ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అక్కడే అభివృద్ధి చేశారు. విభజన తర్వాత జిల్లా ఆసుపత్రిని అక్కడే అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆసుపత్రిగా తణుకు ఏరియా ఆసుపత్రి చెలా మణీ అవుతోంది. నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదికూడా రెండు జిల్లాల సమస్యగా మారింది. జిల్లాల విభజన తర్వాత జిల్లా ఆసుపత్రి తణుకులో శాశ్వతంగా ఉంటుందా లేదా అనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇలా జిల్లా ఆసుపత్రి విషయంలోనూ గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేక పోయింది.

ఏలూరుపైనే ఆధారం

ఇప్పటికీ జిల్లా కోసం అవసరమైన సాధారణ ఖర్చులకు ఏలూరుపైనే ఆధారపడుతున్నారు. ఏలూరుకు బడ్జెట్ కేటాయిస్తున్నారు. అక్కడ నుంచే జిల్లాలో పరిపాలన నిర్వహణకోసం నిధులు రాబట్టుకోవాల్సి వస్తోంది. గతంలో జిల్లా కలెక్టర్ ఇదే విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. నేరుగా నిధులు ఇవ్వాలని కోరారు. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ జిల్లాలో అదే పరిస్థితి నెలకొంది. బదిలీల వ్యవహారంలో కొన్ని శాఖలకు ఇప్పటికీ అధికారాలు లేవు. విద్యాశాఖలో సిబ్బంది, ఉపాధ్యాయుల బదిలీ అంతా ఏలూరు విద్యాశాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. పాలన మాత్రం జిల్లా విద్యాశాఖ నిర్వహిస్తోంది. నీటి పారుదల శాఖలోనూ అదే పరిస్థితి. డెల్టా ప్రాంతమంతా జిల్లా పరిధిలో ఉంది. కానీ ఇక్కడ నుంచి ప్రతిపాదనలు నే రుగా ప్రభుత్వానికి పంపడానికి లేదు. ఏలూరు సర్కిల్ కార్యాలయానికి పంపాలి. కేవలం పరిమితమైన పాలనకే జిల్లాల విభజన ఉపయోగపడుతోంది. అంతే తప్పా బదిలీలు, నిధులు విషయంలో ఏలూరుపైనే ఇప్పటికీ ఆధారపడుతున్నారు.

పాలనలో ఇబ్బందులు

జిల్లాల విభజనలో ఏడు నియోకజవర్గాలు పశ్చిమలో, ఏడు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో ఉన్నాయి. ఉంగుటూరు నియోకవర్గం ఏలూరులో ఉన్నాసరే అందులో ఒక మండలం అయిన గణపవరాన్ని భీమవరంలో విలీనం చేశారు. అక్కడ ఎమ్మెల్యే ఒకరైతే, అధికారులు వేరే జిల్లాకు చెందిన వారయ్యారు. స్థానిక ప్రజల సమ్మతితో వైసీపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు ప్రకటించింది. రెవిన్యూ డివిజన్‌కు వచ్చేసరికి గణపవరం భీమవరంలో ఉంది. నియోజకవర్గ పరంగా ఉంగుటూరు పరిధిలోకి వెళ్లింది. ఇలా ఒకే మండలం రెండు జిల్లాల పాలనలో కొనసాగుతోంది. నిధుల కేటాయింపు, పాలనలోనూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- మొత్తం ఓటర్లు 3,729
- అత్యధికంగా భీమవరంలో 759 మంది
- అత్యల్పంగా కాళ్ళలో 52 మంది ఓటర్లు
- ఈనెల 5వ తేదీన పోలింగ్

భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : ఈనెల 5వ తేదీన జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను గుర్తించి 20 ఏర్పాటు చేశారు. 130 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో పీవోఎస్‌లుగా 26 మందిని నియమించగా ఇందులో ఆరుగురు రిజర్వర్‌గా నియమించారు. ఓపీఓ ఎస్‌లుగా 78 మందిని నియమచింగా ఇందులో 18 మందిని రిజర్వ్‌గా ఉంచారు. మైక్రో అబ్జర్వర్‌లుగా 26 మందిని నియమించగా అందులో ఆరుగురుని రిజర్వ్‌గా ఉంచారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నారు. మరో 4 రోజుల్లో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ము మ్మరం చేస్తున్నారు. అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నవారు కూడా పాఠశాలలకు వెళ్లి ఓటు వెయ్యవలసిందిగా అభ్యర్థిస్తున్నారు. పశ్చిమలో 3,729 మంది టీచర్లు ఓటు హ క్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 2268 మంది, మహిళలు 1461 మంది ఉన్నారు. 20 మండలాలకు సంబంధించిన ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	పీఎస్ నెంబరు	స్కూల్ పేరు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు
అత్తిలి	102	అప్పర్ ప్రైమరీ పాఠశా	90	61	29
ఆకివీడు	104	ఎస్ఎస్ఎస్ ఉన్నత పాఠశాల	90	58	32
ఆచంట	111	ఎంవిఆర్ ఉన్నత పాఠశాల	63	49	18
భీమవరరం	106	ఎస్‌సిహచ్ బిఆర్ఎంపాఠశాల	759	434	325
గణపవరం	96	సిహచ్ బిఆర్ఎం పాఠశాల	66	41	25
ఇరగవఠం	103	జిల్లాపరిషత్ పాఠశాల	53	36	17
కాళ్ళ	105	ఎంపిపి పాఠశాల	52	37	15
మోగల్తూరు	116	పిఆర్ ఉన్నత పాఠశాల	88	67	21
నరసాపురం	115	మునిసిపల్ పాఠశాల	425	226	199
పెంటపాడు	97	ప్రభుత్వ పాఠశాల	73	49	24
పోడూరు	112	డిఎస్‌రాజు ఉన్నత పాఠశాల	71	55	16
పాలకోడేరు	107	జెడ్‌పి ఉన్నత పాఠశాల	102	74	28
పెనుమంత్ర	109	భవితాఇంటిగ్రేటెడ్ రెవెన్యూసెంటర్	85	62	23
పెనుగొండ	110	ఎంపిడివో కార్యాలయం	156	106	50
పాలకొల్లు	113	బిఆర్ఎంవి పాఠశాల	480	289	191
తాడేపల్లిగూడెం	87	మునిసిపల్ ఉన్నత పాఠశాల	377	198	179
తణుకు	98	జె.సీతామహాలక్ష్మి గర్ల్స్‌పాఠశాల	407	230	177
ఉండి	103	జడ్పీ ఉన్నత పాఠశాల	69	38	31
వీరవాసరం	108	ఎంఆర్‌కె ఉన్నత పాఠశాల	129	86	43
యలమంచిలి	114	ఎంపీపీ ప్రైమరీ పాఠశాల	94	72	22
			3,729	2268	1461

216 జాతీయ రహదారి పనుల్లో డొల్లతనం

- ఏడాదికే గోతులు
- నిరంతరం గోతులకు అతుకులు
- ఇంకా పూర్తికాని అప్రోచ్ రోడ్డు పనులు
- పెండింగ్ పనులు ఉండగానే టోల్‌గేట్ బాదుడు
- ఈనెల 5న నిపుణుల బృందం రాక



మొగల్తూరు రోడ్‌లో చర్చి వద్ద గోతికి వేసిన సిమెంట్ అతుకు

నరసాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్న రోడ్డును హైవేగా మార్చితే ప్రజలు సంతోషపడతారు. కాని ఇక్కడ భిన్నమైన పరిస్థితి నెలకొంది. అన్ని గోతులే. ఏమాత్రం డ్రైవింగ్‌లో ఆదమరిచినా ప్రమాదం పొంచి ఉన్నట్లే. ఇది జిల్లాలో కొత్తగా ఏర్పడిన 216 జాతీయ రహదారి పరిస్థితి. ఏడాది క్రితం వేసిన ఈ రహదారిపై అడుగడుగునా గోతులే. ఈ గోతుల్ని కప్పిపుచ్చుకునేందుకు నెలకు నాలుగైదు సార్లు అతుకులు వేసి కవర్ చేస్తున్నారు. అయినా ప్రమాదాలు తప్పడం లేదు. అత్యధిక ప్రమాదాలు ఈ రహదారిపైనే జరుగుతున్నాయి. దీనికి కారణం అసంపూర్తి పనులే. రోడ్లు వేశారే గాని అప్రోచ్ రహదారులు మరిచారు. కొన్ని చోట్ల డ్రెయినేజీలను కలపలేదు. విద్యుత్ స్తంభాలకు దిమ్మలు కట్టి స్తంభాలు తెచ్చి వాటిని బిగించడం మరిచారు. ఇన్ని పనులు పూర్తి చేయకుండా వాహనదారులపై టోల్‌గేట్ బాదుడు మోపడం కొసమెరుపు.

కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు....

తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 255 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతాల గుండా 216 జాతీయ రహదారికి 2015లో పచ్చజెండా ఊపారు. 2016లో పనులు ప్రారంభించారు. పనుల్ని మూడు విభాగాలుగా విభజించారు. కత్తిపూడి నుంచి రాజోలు వరకు ఒకటి, చించినాడ నుంచి భీమవరం మండలం లోసరి వరకు రెండు, లోసరి నుంచి బాపట్ల వరకు మూడు విభాగాలుగా విభజించి పనులు పూర్తి చేశారు. జిల్లాలో చించినాడ నుంచి చేపట్టిన 51 కిలోమీటర్ల మేర పనుల పూర్తికి పదేళ్ల పట్టింది. 2020 నాటికి ఈ పనులు పూర్తికావాలి. అయితే కొవిడ్, ఇసుక కొరత, ఇతర కారణాలు సాకుగా చూపించి కాలయాపన చేశారు. దీని వల్ల వాహనదారులు పదేళ్ల పాటు ఇబ్బందులు పడ్డారు. గత ఏడాది సెప్టెంబరులో ఈ రహదారిని అధికారికంగా ప్రారంభించి సీతారాంపురం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు.

ఏడాదికే గోతులు....

ఈ పనుల్లో డొల్లతనం ఏడాదిలోనే బయటపడింది. దిగమర్రు నుంచి నరసాపురం పట్టణంలోని రుస్తుంబాదా వరకు సుమారు 10కిలోమీటర్ల రహదారిలో అడుగడుగున గోతులే కనిపిస్తాయి. అవి కూడా చిన్న చిన్నవి కావు. పెద్ద పెద్ద గోతులు. వీటిని కప్పిపుచ్చుకునేందుకు హైవే అధికారులు నెలలో నాలుగైదు సార్లు అతుకులు వేస్తున్నారు. అయినా ఇవి నిలవడం లేదు. మళ్లీ కొత్త ప్రదేశాల్లో గోతులు ఏర్పడుతున్నాయి. ఇలా ఈ రహదారిపై ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తాయి. రోడ్డుకు ఇరువైపులా పంట కాల్వ, మురుగు డ్రెయినేజీ ఉంది. ఈకారణంగా గోతులు పడతాయన్న ఉద్దేశంతో ప్రారంభంలోనే కొత్త టెక్నాలజీ ఉపయోగించారు. ముందుగా కాల్వలు ఉన్నవైపు ఆరు అడుగులు తవ్వి సిమెంట్ గోడ కట్టారు. ఆ తరువాత రోడ్ వేశారు. అయినా ఉపయోగం లేకుండాపోయింది. రోడ్డు వేసేటప్పుడు నాణ్యతలు పాటించకపోవడం వల్లే తరుచూ గోతులు పడుతున్నాయన్న వాదనలు వాహనదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అత్యధిక ప్రమాదాలు...

గతంలో ఈ రహదారిపై ప్రమాదాల సంఖ్య తక్కువగాఉండేది. హైవే ఏర్పాటు తరువాత వీటి సంఖ్య పెరిగింది. తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ రహదారిపైకి రావాలంటే వాహనదారులు భయపడిపోతున్నారు. దీనికి కారణం గోతులు, అప్రోచ్ రహదారులు పూర్తి చేయకపోవడం, స్పీడ్ కంట్రోల్‌కు చర్యలు చేపట్టకపోవడమే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

5న నిపుణుల బృందం రాక

సాయిశ్రీనివాస్, ప్రాజెక్టు డైరెక్టర్

ఈ రహదారిపై గోతులు పడుతున్న విషయం వాస్తవం. ఈసమస్యను శ్వాశత పరిష్కారానికి చర్యలు చేపట్టాం. ఈనెల 5న ఢిల్లీ నుంచి నిపుణుల బృందం వచ్చి 216 రహదారిని పరిశీలిస్తుంది. బృందం ఇచ్చే సూచనలకు అనుగుణంగా పనులు చేస్తాం. అది కూడా నెల రోజుల్లో పూర్తి చేయిస్తాం. ఇక అసంపూర్తిగా మిగిలిన పనుల్ని కూడా ఏడాది నాటికి పూర్తి చేయిస్తాం.

అసంపూర్తి పనులు



మధ్యస్థంగా నిలిచిన డ్రెయినేజీ కల్వర్ట్ పనులు... దిమ్మ కట్టి ఇంకా ఏర్పాటు చేయని విద్యుత్ స్తంభం



ఈ రహదారికి అనుసంధానంగా అనేక గ్రామాలకు, వార్డులకు వెళ్లే రహదారులు ఉన్నాయి. పనులు పూర్తికాగానే అప్రోచ్ రహదారులు ఎత్తు చేసి వాటికి కింద నున్న రహదారులకు సమానంగా తారు రోడ్డు వేయాలి. ఈ పనులు పూర్తి చేయలేదు. ఈకారణంగా హైవే ఎక్కే సమయంలో వాహనదారులు ప్రమాదాలు బారినపడుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఈ రోడ్‌పై ఎక్కువగా జరుగుతున్నాయి. పట్టణంలో హైవే నిబంధనల ప్రకారం చేపట్టాల్సిన డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఇక రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు దిమ్మలు కట్టి స్తంభాలు తీసుకొచ్చారు. కాని ఇప్పటి వరకు వాటిని నిలబెట్టలేదు.

నాన్నే నాకు స్ఫూర్తి

సేవ చేయాలన్న లక్ష్యంతోనే పోలీస్ శాఖలోకి

స్మార్ట్ వర్క్‌తో చదివితే విజయం తథ్యం

నరసాపురం డీఎస్పీ శ్రీవేద



డీఎస్పీ శ్రీవేద.. భర్త, కుమార్తెతో

నరసాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాన్న సూర్యప్రకాశరావు రిటైర్డ్ ఐజీ.. పోలీస్ శాఖలో నిజాయితీగా పనిచేసి ఎన్నో కేసుల్ని చేధించారు...చిన్నతనం నుంచి నాన్నను చూస్తూ పెరిగా.. పోలీస్ అవ్వాలని కలలు కన్నా.. దానికి తగ్గట్టుగానే చదువుల్లో రాణించి డాక్టరయ్యాను.. డాక్టర్‌గా ప్రజలకు సేవ చేస్తున్నా...నా టార్గెట్ వదల్లేదు. మూడేళ్లు కష్టపడి చదివా. మొదటి ప్రయత్నంతోనే గ్రూప్-1 ఎంపికై పోలీస్‌శాఖలో చేరాను. నా ఆశయాన్ని నేర వేర్చుకున్నా.. నాకు స్ఫూర్తి.. మా నాన్నే.. అని నేటి విద్యార్థులు అను కున్నది సాధించాలంటే పట్టుదలతో పాటు ప్లానింగ్ కూడా అవసరం.. ఎన్నిగంటలు చదివాం.. అన్నది ముఖ్యం కాదు...మంచి పుస్తకాలను అవసరమైతే ఒకటి రెండు సార్లు చదివాలి. ర్యాంకు సాధించాలంటే స్మార్ట్‌వర్క్ చాలా ముఖ్యమని చెబుతున్నారు నరసాపురం డీఎస్పీ శ్రీవేద.. ఆమె విజయం వెనుక ఆమె పడ్డ కష్టం ఆమె మాటల్లోనే..

మాది శ్రీకాకుళం జిల్లా...మా నాన్న సూర్యప్రకాశరావు 1987లో డీఎస్పీగా పోలీస్‌శాఖలో చేరారు. ఉమ్మడి ఆంధ్రలో పలు జిల్లాల్లో పని చేయడం వల్ల నా విద్య చాలాచోట్ల సాగింది. మేము ముగ్గురు అక్కచెల్లెళ్లం. నేనే చివర.. పదో తరగతి హైద్రాబాద్‌లోని సెంట్ ఆన్స్‌లో చదివా. ఇంటర్‌లో కూడా టాపర్‌నే. డాక్టర్ చదవాలని బైసీపీ చదివా. అయితే బీడీఎస్ వచ్చింది. నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లిలో పూర్తి చేశా. యూనివర్సిటీ గోల్డ్ మెడల్. ఎండీఎస్ హైద్రాబాద్‌లో పూర్తి చేశా..అక్కడ కూడా టాపర్‌నే.

ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వశాఖలో చేరా.. శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తూ గ్రూప్ 1కు ప్రిపేర్ అయ్యాను. మూడేళ్లు కష్టపడి చదివాను. కోచింగ్ తీసుకోలేదు. నోట్స్ ప్రిపేర్ బాగా కలిసొచ్చింది, ఆన్‌లైన్ బాగా ఉపయోగపడింది. ఆన్‌లైన్ పరీక్షలు కూడా రాశాను. ఇంటర్వ్యూకు మాత్రం హైద్రాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. 2022లో ఎంపికయ్యాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం చాలా ఆనందం అనిపించింది. దీనికి నా భర్త, అత్తమామల ప్రోత్సాహం ఎంతో ఉంది.

భర్త హైకోర్టు న్యాయవాది..ఒక పాప, ఫస్ట్‌క్లాస్ చదువుతోంది. మా అత్తగారి కుటుంబం న్యాయ శాఖకు సంబంధించిదే. మామగారు జిల్లా జడ్జిగా పని చేశారు. శిక్షణలో కూడా నాకు మంచి అవార్డులు దక్కాయి. ట్రైనింగ్ బ్యాచ్‌ను నేనే లీడ్ చేసేదాన్ని. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ మూడు నెలలు ఇచ్చారు. ప్రసంశాపత్రం కూడా దక్కింది.

స్టేషన్ వచ్చేవాళ్లకి న్యాయం జరగాలి

సమస్య వచ్చినప్పుడు న్యాయం జరుగు తుందని పోలీస్‌స్టేషన్‌కు వస్తారు. వారి నమ్మకానికి అను గుణంగా పని చేయాలన్నదే నా ఉద్దేశం. స్టేషన్లకు వచ్చే వారందరికీ న్యాయం జరిగేలా చూస్తా. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, ఈవ్‌టీజింగ్, చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల్ని అరికట్టాలన్నదే నా లక్ష్యం. నేను బాధ్యతలు చేపట్టగా వచ్చిన మొదటి కేసు పోక్సో కేసు. మొగల్తూరు స్టేషన్‌లో నమోదైన ఈ కేసును రెండు రోజుల్లో చేధించాం.

చిన వెంకన్న ఆలయంపై డ్రోన్ కలకలం

యూట్యూబ్‌లో వైరలైన వైనం

ఇది పాత వీడియో : ఈవో మూర్తి



విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బారావు

ద్వారకాతిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంపై డ్రోన్ ఎగిరిందన్న వార్త ఆదివారం దుమారాన్ని రేపింది. శేషాచలంపై ఓ యూట్యూబర్ డ్రోన్‌ను ఎగురవేసి ఆ విజువల్స్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. డ్రోన్ ఎగుర వేసిన యూట్యూబర్ పైనా...పట్టించుకోని భద్రతా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అయితే దీనిపై ఆలయ ఈఓ మూర్తి వివరణ ఇస్తూ అన్ని రకాలుగా విచారణ చేశామని ఇది ఎప్పుడో పాత వీడియో అని.. ఇటీవల తీసింది కాదని గుర్తించామన్నారు. అది డ్రోన్ వీడియో కాదని.. లాంగ్ షాట్ వీడియో అని వివరణ ఇచ్చారు. అయితే ఈ ఘటనపై కలెక్టర్ విచారణ జరపాలని ఆదేశాలివ్వడంతో తహసీల్దారు సుబ్బారావు అన్ని కోణాల్లో దీన్ని పరిశీలించి నివేదిక పంపారు. యూట్యూబ్‌లో ఈ వీడియోలు తొలగించినట్టు తెలిసింది.



తణుకులో చిన్నారుల రికార్డు నృత్య ప్రదర్శన

తణుకు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 185 మంది కూచిపూడి చిన్నారులు రింగ్ డ్యాన్స్ విత్ ఫైర్ ప్రదర్శనకు తణుకు పట్టణం వేదికైంది. ఆదివారం ఏఎస్‌ఆర్ కళాశాల ప్రాంగణలో శ్రీ పద్మజా నృత్య కళాక్షేత్రం చిన్నారులు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్-జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ రికార్డ్ నమోదు చేశారు. కార్యక్రమానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ, ఏఎస్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఆకుల విజయవర్దన్ విచ్చేసి చిన్నా రులను అభినందించి మెమొంటోలు అందిం చారు. కాగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి చిన్నారులను అభినం దించారు. వేదికపై కూచిపూడి గురువు చింతా రవిబాల కృష్ణ చేసిన మోహిని భస్మాసుర నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



జిల్లాస్థాయి భగవద్గీత పోటీల విజేతలకు బహుమతి

భీమవరంటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో నిర్వహించారు.జిల్లాలోని అనేక పాఠశాలలో పోటీలు నిర్వహించి అందులో మొదటి బహుమతి పొందిన సుమారు 100 మంది బాల,బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదాన సభకు ఆనంద గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కేజీఆర్‌ఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రాజీ బహుమలందజేశారు. చిన్మయ మిషన్ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్ స్వాగతం పలికి నారు. ముఖ్య అతిథి విశ్వనాథరాజు మాట్లాడుతూ గీత పఠనం వల్ల విద్యార్థులలో మానసిక శక్తి పెరిగి ఉన్నత ఆలోచనలు కార్యశీలత పెరుగుతుందన్నారు. ఈ పోటీలకు గోపాల శర్మ, శారద, తమ్మన రామలక్ష్మి, మౌళి లత, బొండాడ ఇందిరా, పెరుమాల ప్రతిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆరు గ్రూపులలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన18 మంది బాల బాలికలకు నగదు బహుమతి అందజేశారు.

పరిహారం దక్కేనా ?

పంట నష్టపరిహారం కోసం రైతుల ఎదురు చూపు..

ఎర్రకాల్వ వరదలకు పంట కోల్పోయిన రైతుల ఆందోళన



ఎర్రకాల్వ వరదకు నందమూరులో మునిగిన చేలు(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ రైతులు పంట నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం, నల్లజర్ల మండలం, నిడదవోలు మండలాలకు చెందిన సుమారు 15 వేల ఎకరాల్లో ఎర్రకాలువ వరదలకు గత జూలై నెలలో పంట నష్టం వాటిల్లింది. అయితే ఈ పంట నష్ట పరిహారం ఇవ్వకుండా ఆగస్టు పరిహారం నెల క్రితమే ప్రభుత్వం విడుదల చేయడంతో ఎర్రకాలువ వరదల కారణంగా నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు. పంట నష్టపోయి మళ్లీ పంట వేసిన తరువాత కూడా ఏక్షణాన వరదలు వస్తాయని రైతులు భయపడుతూనే సాగుచేశారు. అయితే ప్రభుత్వం తమకంటే వెనకాల నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించడంపై తమకు పరిహారం అందుతుందో లేదో అని ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం ఎర్రకాలువ వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఎర్రకాలువ వరదలకు తాడేపల్లిగూడెం మండలంలోనే ఏకంగా 6 వేల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. మండలంలోని నందమూరు., మారంపల్లి, ఆరుళ్ల, జగన్నాథ పురం, మాధవరం, అప్పారావుపేట, పట్టిం పాలెం, వీరంపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో 6 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు నివేదికలు పంపించారు. అంటే ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు చొప్పున రూ.6 కోట్ల పంటనష్ట పరిహారం అందించాల్సి ఉంది. త్వరగా ఈ పంట నష్ట పరిహారం అందిస్తే రైతులకు ఊతం ఇచ్చినట్టు ఉంటుందని రైతులు కోరుతున్నారు.

ఇప్పటికే ఆలస్యం అయింది..



జూలై నెలలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. ఇకనైనా పరిహారం అందిస్తే రైతులకు మేలు చేసినట్టు ఉంటుంది. కూటమి ప్రభుత్వంపై రైతులకు ఎంతో నమ్మకం ఉంది త్వరగా పరిహారం చెల్లించాలి.

-పరిమి వీరభద్రరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు

ఎకరాకు రూ.16 వేలు ఇవ్వాలి



మాకు పరిహారం పదివేల లోపు ఇస్తారని అధికారులు చెబుతున్నారు. కానీ విజయవాడ ప్రాంత రైతులకు ప్రత్యేక పరిహారం ఇచ్చినట్టు మాకు కూడా ఎకరాకు రూ.16 వేలు చెల్లిస్తే బాగుంటుంది.

-ముళ్లపూడి రామకృష్ణ, రైతు





సంతాప సభలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ.. పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, రఘురామకృష్ణరాజు

సూర్యనారాయణరాజు పేరిట ట్రస్టు ఏర్పాటు

తండ్రి సంస్మరణ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి భూపతిరాజు సూర్యనారాయణ రాజు పేరిట ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రకటిం చారు. ఆయన తండ్రి సూర్యనారాయణరాజు సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తగా ప్రస్తానం ప్రారంభించి తండ్రి ప్రోత్సాహంతో ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. తన పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రోజు సమయం కేటాయించి పని చేస్తానని కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పథంలో తీసుకువెళతానన్నారు. సంస్మరణ సభలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, సోము వీర్రాజు, మాధవ్, జీవీఎల్ నరసింహరావు, మంతెన రామరాజు పాల్గొన్నారు.





డీఎంహెచ్‌వో ఉమా మహేశ్వరరావు నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న జక్కంపూడి రాం ప్రసాద్..ఉండి వైద్యుడు సాయిచంద్ర, ఎల్‌టీ శ్రీదేవి

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు

పాలకొల్లు/ ఉండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమా మహేశ్వరరావు, అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భానునాయక్‌ల నుంచి అవార్డు, ప్రశాంసాపత్రం అందుకున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు, పౌష్టికాహారం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేసిన రాంప్రసాద్‌కు అవార్డు లభించడంపై పలువురు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, డాక్టర్లు అభినందించారు. హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టినందుకు ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.సాయి చంద్ర, ఎల్‌టిగా పనిచేస్తున్న శ్రీదేవి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

మెడికల్ సూపరింటెండెంట్ రాజు

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

ఏలూరు క్రైం, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించే విధంగా అధికారుల సహకారంతో కృషి చేస్తున్నామని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సమస్యల తిష్ట అనే శీర్షికలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతో వచ్చే రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని కథనానికి ఆయన స్పందించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగ వైద్యులు తప్ప మిగతా వైద్యులు అంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆధీనంలో ఉంటారని ఆ పోస్టుల భర్తీపై వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారికి విన్నవించామన్నారు. ఆసుపత్రి వైద్య సేవలపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ప్రజా ప్రతినిధులు, డీఎంహెచ్‌వో, డీసీహెచ్ అధికారుల సహకారంతో సిబ్బంది ఉత్తమ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని రాజు తెలిపారు.

గరికి ముక్కు సుబ్బయ్యకు ఢిల్లీ ఆహ్వానం



భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : బాబాసాహెబ్ బి.ఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి పురస్కరించుకొని భారత పార్లమెంట్లో ఈనెల 6వ తేదీన 69వ మహా పరినిర్వాన్ దివస్ కార్య క్రమాన్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ, అంబేడ్కర్ ఫౌండేషన్ నిర్వహి స్తున్నది. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్యకు అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్మన్ వీరేంద్ర కుమార్ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సుబ్బయ్య తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్‌తో పాటు ఇతర మంత్రిత్వ శాఖల మంత్రులు హాజరు కానున్నారు. మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ , కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లు సుబ్బయ్యను అభినందించారు



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి

సుప్రీం కోర్టు మాజీ జస్టిస్ చలమేశ్వర్

నరసాపురం , డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల సంఖ్య పెరగాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఆదివారం తెలగా కల్యాణ మండపంలో నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దివంగత న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. న్యాయవ్యవస్థలో పరిస్థితులకు అనుగుణంగా సమర్ధతను పెంపొందించాలన్నారు. ఇటీవల కాలంలో సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం పెరగడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు ఓపిక ఉన్నంత వరకు న్యాయస్థానాలకు రావాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ , ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు చిదంబరం, జిల్లా ఆదనపు న్యాయమూర్తి విజయదుర్గా, న్యాయమూర్తులు గంగరాజు, వరలక్ష్మి, శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ, జీవికె రామారావు, కానూరి బాబ్జీ, కొత్తపల్లి రమేష్, పూరేళ్ళ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

క్షీరారామ, మావుళ్లమ్మ ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



మావుళ్ళమ్మను దర్శించుకున్న జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు

పాలకొల్లు అర్బన్/ భీమవరంటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం శ్రీక్షీరారామ లింగేశ్వరస్వామి, భీమవరం మావుళ్లమ్మ ఆలయాలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల పూజలు అనంతరం న్యాయ మూర్తి దంపతులకు పండితులు వేదాశీర్వాదం అనంతరం స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందించారు. అందించారు. మావుళ్ళమ్మ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి వేద ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ అందించారు.

ముంబయి ఎయిర్ బస్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేవలం రెండు గంటల్లోనే రాజ మహేంద్రవరం నుంచి ముంబయికి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముంబయికి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమహేంద్రవరం -ముంబయికి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభ మవుతుందన్నారు. కేంద్రమంత్రి రామ్మో హనాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసు వేశారన్నారు. ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబయి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబయి చేరుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు 13 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్‌కు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు కాగా 13 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

యువతి అనుమానాస్పద మృతి



ప్రియాంక(ఫైల్)

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : ఒక యువతి ఉరి వేసుకుని మృతి చెందినట్టు సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన తెల్లం శ్రీకాంత్ (30) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మత్తు శస్త్రచికిత్స విభాగంలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అతను గవర్నమెంట్ ఆసుపత్రిలో పనిచేసే నర్సును వివాహం చేసుకున్నాడు. ఏలూరులోని వంగాయి గూడేనికి చెందిన కాలి ప్రియాంక (25) పదోతరగతి వరకు చదివి బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని హైదరాబాద్‌లో పనిచేస్తున్నది. ఆమె తండ్రి అనారోగ్యంతో ఉండ డంతో ఏడాదిన్నర క్రితం ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో చేర్పించింది. ఆ సమయంలో శ్రీకాంత్ పరిచయం అయ్యాడు. తనకు వివాహం కాలేదని పెళ్ళి చేసుకుంటానని నమ్మబలికి ప్రియాంకను పెళ్ళి చేసుకున్నాడు. ఈ విషయం ఆ అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో బాగానే చూసు కుంటానని నమ్మ బలికాడు. ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ప్రియాం కను అక్కడ ఉంచాడు. కొద్ది రోజుల నుంచి గొడవలు జరుగు తున్నాయని, తన దగ్గర నుంచి డబ్బులు తీసు కుంటున్నాడని అతనికి పెళ్ళి కూడా జరిగిందని ప్రియాంక తన తల్లి దండ్రు లకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు శ్రీకాంత్‌ను నిల దీశారు. జాగ్రత్తగా చూసుకుం టానని నమ్మ బలికాడు. శనివారం రాత్రి కూడా వారిద్దరి మధ్య గొడవలు జరిగినట్లుగా చెబు తున్నారు. ఆదివారం ఉదయాన్నే శ్రీకాంత్ ప్రియాంక తల్లి దండ్రులకు ఫోన్ చేసి ఆమె ఉరి వేసుకుని మరణించిందని చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందించడంతో సీఐ రమణ సంఘ టనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒక వివాహిత ఇంటి నుంచి వెళ్ళిపోయిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. ఏలూరు తమ్మిలేరు ఏటిగట్టు గొల్లాయిగూడెం ప్రాంతానికి చెందిన దేవరపల్లి రవికుమార్‌కు భార్య ధనలక్ష్మి (20), ఒక కుమార్తె ఉన్నారు. సెప్టెంబర్ 12వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఆమె ఇంటి నుంచి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కానరాలేదు. దీంతో ఆమె భర్త ఫిర్యాదు చేయడంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతూ

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువకుడు శనివారం రాత్రి ఏలూరు పడమర లాకుల సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చి పైనుంచి దూకేశాడు. దీంతో అతను తీవ్ర గాయాలకు గురయ్యాడు. పెదపాడు మండలం కొత్తూరుకు చెందిన పాలపర్తి సురేష్ (30) శనివారం రాత్రి తన కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకోవడానికి ఏలూరు పడమర లాకుల సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చి పై నుంచి దూకేశాడు. గాయాలతో ఉన్న అతను కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు ఆ కేకలు విని అగ్నిమాపక సిబ్బందికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ డిపార్ట్‌మెంట్ రెస్క్యూ టీమ్ వచ్చి అతనిని బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తర లించారు. కుటుంబ సభ్యుల మధ్య పొలాల గొడ వలు నేపథ్యంలో అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ముసునూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన ముసునూరు మండలం గుడిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. నూజివీడు పట్టణానికి చెందిన నల్లపు మేరి (35)కి, గుడిపాడుకు చెందిన పెనుమాల గిరికి 20 ఏళ్ళ క్రితం వివాహమైంది. అయితే గిరి వివాహేతర సంబంధం పెట్టుకుని, మద్యం సేవిస్తూ, భార్య మేరిని రెండేళ్లుగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. పెద్దల సమక్షంలో మూడుసార్లు పంచాయతీ పెట్టి గిరిని హెచ్చరించినా అతని తీరు మారలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన భార్య చనిపోయిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నూజివీడు సీఐ రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి, నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మేరీ మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల విచారించారు. మేరీ హత్య చేయబడిందని, ఆమె మెడపై వైర్‌తో ఉరివేసినట్లు అనుమానంగా ఉందని కుటుంబసభ్యులు ఆరోపించారు. తన అక్కను గిరి ఉరివేసి చంపాడని మృతిరాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మేరీ మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అయితే ఇంటిలో ఉన్న బియ్యపు డ్రమ్ములో వైర్ ఉన్నట్టు గుర్తించిన పోలీసులు గిరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.


డీఎస్సీ కోచింగ్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

డీఎస్సీలో మంచి ఫలితాలకు కృషి చేద్దాం : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే పాలకొల్లు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ద్వారా మంచి ఫలితాలు సాధించేలా కృషి చేద్దామని నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు ఏఎంసీ సమావేశ హాలులో కోచింగ్ ఇచ్చే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా సేవాభావంతో పలు సబ్జెక్టుల్లో బోధన చేసే ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికి 800మంది కోచింగ్‌కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. కోచింగ్‌లో ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న అవనిగడ్డ ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు పూర్ణను స్వయంగా వెళ్లి కలిసి కోచింగ్‌లో సహకరించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఆమె ప్రతీవారం వచ్చి పర్యవేక్షణతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ వంటివి అందిస్తానన్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.


పెదఅమిరంలో జ్యోతిరావు పూలే విగ్రహాలు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

స్కూళ్లలో పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కాళ్ళ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భావి తరాల వారికి మన మహనీయుల చరిత్ర తెలిపేందుకు ప్రతిపాఠశాలలో వారి విగ్రహాలు నెలకొల్పాలని, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే శతాబ్దాల క్రితమే విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు చేశారని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘసేవకులు చెరుకువాడ రంగసాయికి జ్యోతిరావు పూలే విగ్రహాలు తయారు చేయించామన్నారు. ప్రస్తుతం పెదకాపవరం, జక్కరం, పాలకోడేరు పాఠశాలలో ఈ విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన సందర్భంగా రఘురామను పలువురు నాయకులు సత్కరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ వేగేశ్న కనకరాజు సూరి, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొలిశెట్టికి సత్కారం

పెంటపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి తరపున ఉభయగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రభుత్వ విప్ అయిన సందర్భంగా ఆయనను సత్కరించారు.


ఎమ్మెల్యే బొలిశెట్టిని సత్కరించిన కూటమి ఎంఎల్‌సీ అభ్యర్థి రాజశేఖరం



ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులతో క్లబ్ కార్యవర్గ సభ్యులు

430 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పాలకొల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో 430 మంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) తెలిపారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అయినప్పటికీ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఎన్.రమణి, జోన్ చైర్మన్ కె.అన్నపూర్ణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ జయభారతరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు, ఫెమినా అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ, యిమ్మిడి లలిత, మాటూరి రత్నదీప, కార్యవర్గ సభ్యులు వసంతలక్ష్మి, ఆర్.దీప్తి, సభ్యులు పాల్గొన్నారు. వైద్యులు పి.రవిచందర్, డాక్టర్ కె.ఉమాదేవి, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఆర్.జయదుర్గాదేవి, డాక్టర్ మౌని, మాచేపల్లి లక్ష్మీదీపిక, బి.స్పందన, రాజిత తదితరులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. కొమ్ముల మురళీకృష్ణ, లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

నరసాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎన్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం మండల సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, అసోసియేషన్ అధ్యక్షుడు వై.మోహనరావు, సంఘం మండల అధ్యక్షురాలు వీవీ లక్ష్మి విచ్చేశారు. సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం సమస్యలపై స్పందించకపోతే భవిష్యత్ కార్యచరణ రూపొందించుకోవాలని సంఘం నిర్ణయించింది.

● అనంతరం మండల సచివాలయ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ వీవీ లక్ష్మి, అసోసియేషన్ అధ్యక్షురాలుగా వి.మౌనిక, పి.లక్ష్మీబాయి, ట్రెజరర్ పులిపాక రవిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వై.సునీల్ బాబు, ఎం.శివనాగేంద్ర, కె.శ్రీనివాస్, సీహెచ్ పద్మజ, ఎం.లావణ్య, జనరల్ కార్యదర్శులుగా బోడపాటి జీవన్, డి.రాజ్‌కుమార్, బి.రేఖ, రహీమ్, కె.గిరిజలను ఎన్నుకున్నారు. కొత్త కమిటీని ఏపీజేఈఏ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, వై.మోహన్‌రావు, ఉమర్ ఆలీషా, కొప్పాడి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్ అభినందించారు.


సమావేశంలో మండల సచివాలయ ఉద్యోగులు

అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

గణపవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సరిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తే సంబంధిత యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని సరిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు హెచ్చరించారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గణపవరం మండలానికి చెందిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కొలువుతీరి ఉన్నాయన్నారు. దీంతో ఈ గ్రామంలో అక్రమ లేఅవుట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో వ్యవసాయ భూముల్లో, వ్యవసాయేతర భూములుగా మార్చి వ్యాపార దుకాణాలు అనుమతి లేకుండా నిర్మాణం చేయవద్దన్నారు. ఆర్‌డీవో అనుమతులు లేకుండా స్థలాల్లో నిర్మాణాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని కూడళ్ళవద్ద, తహసీల్దార్, ఎంపీడీవో తదితర కార్యాలయాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.


హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ అధికారులు

సంచార శకటం ద్వారా వైద్య సేవలు

తణుకు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా వైద్య సేవలను ఆదివారం నిర్వహించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు, మండపాక ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. కాకర్ల సీతాలక్ష్మి ఆర్థిక సాయంతో ఉచితంగా అవసరమైన రోగులకు మందులు అందజేశారు.

‘ఫెంగల్’ భయం

▸▸ వీడని వర్షాలు.. ఆందోళనలో రైతులు

తణుకు/ఆచంట/ఉండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తఫాన్ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆదివారం ఆకాశం మబ్బుతో ఉండి తేలికపాటి వర్షాలు కురవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు బరకాలతో కప్పి భద్రపర్చుకున్నారు. వాతావరణంలో మార్పులు వస్తే వెంటనే రైతు సేవా కేంద్రాలకు ధాన్యం తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తణుకు మండలంలో 11 వేల 300 ఎకరాలకు గాను కేవలం 6 వేల ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది.

సార్వా పంట కన్నీరు కష్టాలే ...

ఉండి మండలంలోని యండగండి, చిలుకూరు, ఉండి గ్రామాల్లో రైతులు ధాన్యపు రాశులు వద్దే ఉంటూ కాపాడుకునే ప్రయత్నాలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నాం తెరపివ్వడంతో రైతులు ధాన్యంపు రాశులను తెరిచి ఒడిబ్బడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల అధికారుల సూచనల మేరకు వరి పంటను కోతల కోయకుండా రైతులు నిలుపుదల చేశారు. కోసిన పంటలను ఒబ్బిడి చేసుకునే పనులు చేస్తున్నారు.


మండపాకలో రోడ్డుపక్కన ధాన్యాన్ని బరకాలతో కప్పిన రైతులు


నరసాపురం, పాలకోడేరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ.. వరల్డ్ ఎయిడ్స్ డే చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఎయిడ్స్ వైద్య నిపుణులు డాక్టర్ మురళీకృష్ణ

అవగాహనతో ఎయిడ్స్ నివారిద్దాం

▸▸ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీలు

నరసాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారిద్దామని డాక్టర్ జె.దేవి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీటీఎస్ హెల్త్ కౌన్సిలర్ జి.జేసు ప్రసాద్‌బాబు, హెడ్ నర్స్ రాజేశ్వరి, ఏసుపాదం, స్వరాజ్యం, వరలక్ష్మి, పాల్గొన్నారు.

● భీమవరం క్రైం : భీమవరం ఏఆర్టీ సెంటర్, మండల న్యాయ సేవా సంస్థ ఉమ్మడి ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఏఆర్టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాది ఎన్.సుధీర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. అనంతరం ఏఆర్టీ సెంటర్ ద్వారా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. న్యాయవాదులు పి.అంబేద్కర్, కె.జ్యోతి, వై.చిన్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆకివీడు/పాలకోడేరు :హెచ్ఐవీ వ్యాప్తిలేని వివక్ష రహిత సమాజాన్ని సాధించాలని సీహెచ్‌సీ వైద్యురాలు నజరీన్, ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్ష-కార్యదర్శులు కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు. ఐసీటీఎస్ కౌన్సిలర్ ఎన్.రాజబాబు, ల్యాబ్ టెక్నీషియన్ కె.చిలకమ్మ, క్లబ్ సభ్యులు ఉన్నారు. పాలకోడేరు మండలం పాలకోడేరులో పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్‌వీ రంగనాయుడు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. సూపర్‌వైజర్లు శంకర్, నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● పోడూరు : మహమ్మారి ఎయిడ్స్ ముప్పు పొంచి ఉందని, ఉదాసీనత వద్దని ప్రముఖ ఎయిడ్స్ వైద్య నిపుణులు మనమదల మురళీకృష్ణ అన్నారు. నేత్రదాన ప్రోత్సాహిక సంఘం వ్యవ స్థాపక అధ్యక్షుడు పెన్మెత్స సుబ్బరాజు ఆధ్వర్యం లో పోడూరు మండలం జిన్నూరు కంటి పరీక్ష కేంద్రం వద్ద ఆదివారం వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించారు. గుండు కుమార్, జుత్తిగ ప్రసాద్, బుద్ధరాజు సుబ్బరాజు, బుద్ధరాజు భారతి పాల్గొన్నారు.

● తణుకు : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సత్తిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● పాలకొల్లు రూరల్/పాలకొల్లు అర్బన్ : లంకలకోడేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ ఎ.ప్రతాప్, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కె.జయభారతరెడ్డి అధ్యక్షతన పౌష్టికాహారం అందించారు. క్లబ్ కార్యదర్శి భానుప్రకాష్, టీవీఆర్ సురేష్, ఎన్ఏ అన్నపూర్ణ, జె. రాంప్రసాద్, ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఏఎస్ఎస్ రమణకుమార్ ఉన్నారు.

● గణపవరం : ప్రతి ఒక్కరూ సంస్కారవంతమైన జీవనవిధానం అవలంబించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా నివారించవచ్చని జిల్లా పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్లు అన్నారు. ఆదివారం గణపవరంలో మండల పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి శివశ్రీనివాసరావు, కోశాధికారి అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తణుకులో ముస్లింల కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న ఆరిమిల్లి.. కాపు తెలగ, బలిజ సంఘ వనసమారాధనలో మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

ఘనంగా కార్తీక వనసమారాధనలు

తణుకు/ఇరగవరం/అత్తిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎవరు ఏ రూపంలో చూసినా భగవంతుడు ఒక్కడేనని మనమంతా తెలుసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఇండియన్ పబ్లిక్ స్కూలు ఆవరణలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వన సమారాధన నిర్వహించారు. స్కూలు అధినేత డాక్టర్ హుస్సేన్ ముస్లిం కార్తీక వన సమారాధన ఏర్పాటు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. ఇరగవరం మండలం రేలంగిలో ఐక్య భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొల్లాడ నాగరాజు, పోలిరాతి ఆదినారాయణ, కోడే సాయిబాలాజీ, రేలంగి సర్పంచ్ స్వరాజ్యం తదితరులు సన్మానించారు. అత్తిలి మండలం అత్తిలిలో మండల ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ నిర్వహించిన కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే ఆరిమిల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పోలిశెట్టి చంటి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘ అధ్యక్షుడు బడేటి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : నియోజక వర్గ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూలపల్లి బైపాస్ రోడ్డులోని అడబాల వారి తోటలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. మహిళలు, చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. సంఘ నాయకులు కర్నేన గౌరునాయుడు, రేజా రమణి, శంకరాపు శ్రీనివాసరావు, చందక సత్తిబాబు, యిజ్జాడ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ : సిద్ధాంతం గ్రామంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. చోడవరపు శ్రీనివాసరావు, శ్యామలాంబ దంపతులచే కార్తీక దామోదరుడికి పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతము, మహిళలతో విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఎక్కల త్రిమూర్తులు, వెంకట నరసింహమూర్తి, భద్రయ్య, చిన్న నానాజీ, చంటి, రాంబాబు, వెంకట రామన్నపాల్గొన్నారు.

● పాలకొల్లు రూరల్ : స్థానిక అడబాల గార్డెన్స్‌లో ఆదివారం శ్రీకృష్ణ దేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ హాజరై సంఘ సభ్యులను, మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా వారిద్దరిని గజమాలలతో సత్కరించారు. సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


వలవల బాబ్జిని సత్కరిస్తున్న నాయకులు

● తాడేపల్లిగూడెం రూరల్ : జగన్నపేటలోని గొర్రెల శ్రీధర్ తోటలో ఆదివారం సామూహిక వనసమారాధన నిర్వహించారు.పట్టణంలోని 14, 17, 18, 19వ వార్డులు, జగన్నపేట, బంగారుగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని సహపంక్తి భోజనాలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జనసేన యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్‌ను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ సత్కరించారు.

రాయకుదురు శివాలయంలో జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలు

వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):రాయకుదురులోని ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కార్తీక అమావాస్య సందర్భంగా నూతనంగా కొమ్మిరెడ్డి శ్రీనివాస్ దంపతులచే ఏర్పాటు చేయబడిన ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలను సంప్రోక్షణ అనంతరం ప్రారంభించారు. దేవస్థానం చైర్మన్ కాయల నానిబాబు దంపతులు, కొమ్మిరెడ్డి శ్రీనివాస దంపతులు, నుదురుపాటి భానుమూర్తి, నుదురుపాటి రామశర్మ, సతీష్ కుమార్‌శర్మ, నిరోగి శేఖర్, నిరోగి శాస్త్రి పాల్గొన్నారు.

‘అందరి మేలుకోరే బంధువులు పురోహితులు’

ఆకివీడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అందరి మేలుకోరే బంధువులు పురోహితులు అని బ్రాహ్మణ సంఘం నిర్వాహకుడు కంభంపాటి నరశింహం అన్నారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ కల్యాణ మండపంలో కంభంపాటి పుల్లయ్యశర్మ-కాశీ అన్నపూర్ణ జ్ఞాపకార్థం పురోహిత సన్మానసభలో పలువురు పురోహితులను సన్మానించారు. సూర్యభాస్కరరావు, కొండల్ మాస్టార్, లక్ష్మణాచార్యులు, రామకృష్ణ,శివ తదితరులు ఉన్నారు.

సుబ్బరాజుకు మాతృ వియోగం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటుకులగుంటకు చెందిన టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు వాడపల్లి వెంకట సుబ్బరాజు తల్లి అనసూయ (75) ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి, కూటమి నాయకులు ఆమెకు నివాళులర్పించారు.



ఆధ్యాత్మికం

ఉమా అగస్త్యేశ్వరుడికి లక్ష పత్రిపూజ

పోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెనుమదంలోని ఉమాఅగస్త్యేశ్వర స్వామికి ఆదివారం ఉమాఅగస్త్యేశ్వరస్వామి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. ఉమాబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, సూర్యనమస్కార పూజలు, దీపాలంకరణతో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు.

● తణుకు : తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా రాష్ట్రం లోని పద్మ శాలీ కుటుంబాలు పద్మశాలీల ఆడబిడ్డ అయిన శ్రీపద్మావతి అమ్మవారికి సారె సమర్పించినట్టు టీడీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి, వెంకట రమేష్ తెలిపారు.

● భీమవరంటౌన్ : కార్తీక మాసం అమావాస్య సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి 50 కేజీల పలు రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వ ర్యంలో మద్దాల వెంకటసతీష్, ఉమా మహేశ్వరి దంపతులు, పట్నాల సాయిదుర్గ, భవాని దంపతులు, పట్నాల బ్రహ్మాజీ, గంగాభవాని దంపతులచే అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మావుళ్ళమ్మ ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని చండీ హోమాన్ని నిర్వహించారు. 65 మంది భక్తులు పూజలో పాల్గొన్నారు.


తణుకులో పద్మావతి అమ్మవారికి సారె సమర్పించిన సరళాదేవి దంపతులు

అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం తరఫున ఈవో నగేష్ ప్రసాదాన్ని అందించారు.

● ఆచంట : కొడమంచిలి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నారాయణ గాయత్రి సహస్ర హోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమా రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

ఆచంట/పాలకోడేరు :కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆదివారం ఆచంటేశ్వరుని ఆలయం వద్ద భారీఎత్తున అన్నసమారాధన జరిగింది. సుమారు 10 వేల మందికి పైగానే భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. గ్రామ పురజనులు, భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించగా నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కార్తీక మాసం పురస్కరించుకుని గ్రామస్థుల సహకారంతో కమిటీ సభ్యులు మూడు రోజులుగా శివయ్యకు 108 కేజీలతో అన్నాభిషేకం, కన్నయ్యకు 108 కేజీల వెన్నాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు.

6 నుంచి 10 వరకు షష్టి మహోత్సవాలు

ఆకివీడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు ఈనెల 6 నుంచి 10 వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకుడు నేరెళ్ళ రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక దేవాలయ ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో మొదటి సారిగా ఉత్సవాలు జరుపుతున్నామని భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. శుక్రవారం సాయంత్రం స్వామి కల్యాణం జరుగుతుందన్నారు. శనివారం స్వామికి అభిషేకం, అన్నసమారాధన, ముఖ్య అతిథిగా ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు హాజరవుతారన్నారు. మోరా శ్రీనివాసరెడ్డి-జ్యోతిరెడ్డి, మోటుపల్లి గంగాధరరావు, మన్నే పోతురాజు, జగ్గురోతు విజయ్‌కుమార్, నేరెళ్ళ అయ్యప్ప, సన్నిధి మాణిక్యాలరావు, అర్చకులు రామకృష్ణ, రామశాస్త్రి తదితరులు ఉన్నారు.

స్వర్ణాంధ్రలో ఫైరింగ్‌పై శిక్షణ

నరసాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సెవెన్ ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. యూనిట్ కమాండర్ కెప్టెన్ వై.ప్రదీప్, డిప్యూటీ క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ సంజీత్ రౌత్రేలు శిక్షణ ఇచ్చారు. అనంతరం కమాండర్లు మాట్లాడుతూ క్యాడెట్లకు క్రమశిక్షణ, ఏకాగ్రత ముఖ్యమన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. మెడిటేషన్, స్పోర్ట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏ స్టాఫ్, మిలటరీ, సివిల్, ఏఎన్‌వోఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

నరసాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీ సమీపంలో ఏర్పడిన జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. కాలనీకి వచ్చే రోడ్డుపై ఏర్పడిన గుంత వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. తక్షణం రహదార్లను అభివృద్ధి చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె.పెద్దిరాజు మాట్లాడుతూ మూడేళ్లు గడిచినా కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీరు సదుపాయాన్ని మెరుగుపర్చకపోవడం దారుణమన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

భీమవరంటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో పర్సును పోగొట్టుకున్న ప్రయాణికుడికి తిరిగి ఆ పర్సును కండక్టరు అందించారు. భీమవరం నుంచి రాజమండ్రి వెళ్తున్న బస్సులో జొన్నాడ వద్ద బస్సు ఎక్కిన ప్రయాణికుడు రాజమండ్రిలో దిగే సమయంలో పర్సును మరిచిపోయి దిగిపోయాడు. అయితే బస్సు కండక్టర్ వైవీ రావుకు పర్సు దొరకడంతో అందులోని ఫోన్ నంబరు ద్వారా సమాచారం అందించడంతో సంబందిత వ్యక్తికి రాజమండ్రిలో డిపో వద్ద గ్యారేజీ సెక్యూరిటీ కానిస్టేబుల్ రాంబాబు సమక్షంలో వైవీరావు అందించారు. పర్సులో రూ. నాలుగు వేల నగదుతోపాటు ఏటీఎం, డెబిట్ కార్డులు ఉన్నాయి. పర్సును అందుకున్న శివ గణేష్ కండక్టర్ వైవీరావును కృతజ్ఞతలు తెలిపారు.

అంధకారంలో జర్నలిస్టుల కాలనీ

ఆచంట, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : ఆచంటలోని జర్నలిస్టుల కాలనీలో ఆదివారం మధ్యాహ్నాం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో కాలనీ అంతా అంధకారంలో ఉంది. ట్రాన్స్‌పార్మర్ పని చేయకపోవడంతో విద్యుత్ సరుఫరా నిలిచిపోయిన కారణంగా రాత్రి ఈ కాలనీ వాసులు అంధకారంలో గడిపారు. రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు వచ్చాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మలు చేసి కాలనీకి విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరుతున్నారు.

క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రామరాజు మృతి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు, చాంబర్ కళాశాల పాలక మండలి కరస్పాండెంట్, సెక్రటరీ అడిటర్ కలిదిండి రామరాజు(76) ఆదివారం ఉదయం అస్వస్థతతో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృత దేహాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు, కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణంరాజు, కలి దిండి సూర్యనారాయణరాజు, కేవీ సీతారామ్, బదరీనారాయణ, బంగార్రాజు, వెంకట పతిరాజు, బీఎస్ఎన్ఎల్ రాజు, శివరామరాజు, నరసింహరాజు, బుద్ధరాజు, పుర ప్రముఖులు సంతాపం తెలిపారు.


రామరాజు (ఫైల్)